సాక్షి
మహబూబాబాద్
మంగళవారం | 7 | అక్టోబర్ | 2025



విద్యార్థుల ప్రతిభకు 'విజ్ఞాన్ మంథన్'

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ కార్యక్రమం దోహదపడుతుంది. - 8లో▸



పాకాల అందాలు అదరహో..!

పాకాల అందాలను వీక్షించేందుకు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వస్తున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33° /21°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

మక్కకు మద్దతేది?

- జిల్లాలో పెరుగుతున్న మొక్కజొన్న సాగు
- ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో మద్దతు ధర కరువు
- ఇష్టారాజ్యంగా ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ
- ప్రభుత్వం చొరవ చూపాలని రైతుల వేడుకోలు



మొక్కజొన్న పంట

సాక్షి, మహబూబాబాద్: ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తులకు మద్దతు ధర లభించడం లేదు. ప్రభుత్వం వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని చెబుతున్నా.. ఆ పంటలను సాగు చేసిన రైతుల కష్టాలను మాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లాలో ప్రతీ ఏడాది మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతున్నా.. ప్రభుత్వం అందించే కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే దిక్కులేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారులు చెప్పిందే వేదంగా మొక్కజొన్నలు కొనుగోలు చేసి రైతులను దోపిడీ చేస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.

పెరుగుతున్న మొక్కజొన్న సాగు

వరి, ఇతర పంటలు సాగు చేస్తే ఆశించిన స్థాయిలో దిగుబడి, లాభాలు రావడంలేదని, మొక్కజొన్న సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో నామమాత్రంగా సాగు చేసిన రైతులు ఇప్పుడు అదే పంటను ప్రధానపంటగా సాగు చేస్తున్నారు. కొత్తగూడ, గంగారం, గూడూరుతోపాటు అన్ని మండలా ల్లో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. గత మూడు సంవత్సరాల క్రితం 40 వేల ఎకరాలకు పరిమితమైన మక్క సాగు ఇప్పుడు 65వేల ఎకరాలకు చేరుకుంది. ఏడాదికి రెండు పంటలు సాగు చేయడంతో మొక్కల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది.

పెరిగిన పెట్టుబడి..

గతంతో పోలిస్తే అన్ని పంటలతోపాటు మొక్కజొన్న సాగుకు పెట్టుబడి పెరిగింది. ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేల అయ్యే ఖర్చు ఇప్పుడు రూ. 30 వేలకు చేరిందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వానాకాలంలో యూరియా కొరత పుణ్యమా అని సకాలంలో యూరియా వేయలేని పరిస్థితి. బ్లాక్‌లో కొనుగోలు చేసి యూరియా వేసిన రైతులు కూడా ఉన్నారు. వాతావరణం అనుకూలించి ఏ ఇబ్బందులు లేకపోతే ఎకరాకు 40 క్వింటాల మేరకు దిగుబడి వస్తుంది. అయితే ఈ ఏడాది సకాలంలో యూరియా వేయకపోవడంతో కంకి నాసిరకంగా పోసిందని, సగానికి దిగుబడి తగ్గుతోందని రైతులు చెబుతున్నారు.

వ్యాపారుల దోపిడీ

కష్టపడి రైతులు పండించిన ఉత్పత్తులకు మద్దతు ధర కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా మొక్కజొన్నకు కనీస మద్దతు ధర రూ.2,400 ప్రకటించింది. అయితే కోవిడ్ కారణంగా 2019 వరకు ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసింది. అనంతరం మహబూబాబాద్, కేసముద్రం మార్కెట్‌లలో మద్దతు ధరకు కొనుగోళ్లు నిలిపేశారు. దీంతో వ్యాపారులు పెట్టిందే ధరగా కొనసాగుతోంది. ప్రస్తుతం క్వింటాకు ఒకటి రెండు కూట్లకు రూ. 2 వేల మేరకు ధర పెట్టి మిగిలిన వాటిని రూ.1,500 నుంచి రూ.1,800 వరకు కొంటున్నారు. దీంతో రైతులు క్వింటాకు రూ. 500 నుంచి రూ. 900 వరకు నష్టపోతున్నారు. అదే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు నష్టం వాటిల్లేది కాదని చెబుతున్నారు.

మొక్కజొన్న సాగు వివరాలు (ఎకరాల్లో..)

2023	51,777
2024	56,643
2025	62,621





మొక్కజొన్నలను ఆరబోస్తున్న రైతులు

కనీస మద్దతు ధర కల్పించాలి



వరి సాగుతో ఇబ్బందులు కలుగుతున్నాయని మొక్కజొన్న సాగు చేస్తున్న. పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. కనీస మద్దతు ధర రూ. 2,400 ప్రకటించినా.. జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో క్వింటాకు రూ. 2వేల లోపే అమ్ముకోవాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

- తాడబోయిన వెంకన్న, నర్సింహులపేట

రైతుల కష్టం వ్యాపారుల పాలు..



మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. కోతులు, అడవి పందుల ఇబ్బందులతో రోజూ కాపలా కాస్తున్నాం.. అన్నీ చేసి మక్కలను మార్కెట్‌కు తీసుకెళ్తే.. వ్యాపారులు చెప్పిన రేటుకు ఇచ్చి రావాల్సి వస్తోంది. ప్రభుత్వం కొనుగోలు చేస్తే మద్దతు ధర వస్తుంది. రైతులకు మేలు జరుగుతుంది.

-అదాన్య వెంకటేశ్, భోగావత్ తండా, కురవి

ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు



కోవిడ్ కాలం 2019 నుంచి మహబూబాబాద్ మార్కెట్‌లో ప్రభుత్వం మొక్కజొన్నలు కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు మార్కెట్‌కు తెచ్చిన మక్కను ప్రైవేట్ వ్యాపారులే కొనుగోలు చేస్తున్నారు. సోమవారం గరిష్ట ధర క్వింటాకు రూ.2,095 పలికింది. మద్దతు ధర కన్నా రూ.300 తక్కువ రేటుకు రైతులు అమ్ముకున్నారు.

- షంషీర్, మహబూబాబాద్ మార్కెట్ కార్యదర్శి

న్యూస్‌రీల్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలి



చిన్నగూడూరు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తాచాటాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ముఖ్యకార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీల అమలుపై నిలదీయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాంసింగ్, నాయకులు మంగపతిరావు, అయూబ్‌పాషా, ధారాసింగ్, చెన్నారెడ్డి, కొమిరెల్లి, ఉప్పలయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బంగారం చోరీ నిందితుల అరెస్ట్



మహబూబాబాద్ రూరల్ : బంగారు చెవి కమ్మలు దొంగిలించిన ముగ్గురు అంతర్రాష్ట్ర మహిళా దొంగలను అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా మధిర మండలం రాయపట్నంకు చెందిన బొజ్జగాని నాగేంద్రమ్మ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా వేర్లపాడు మండలం గోకరాజుపల్లికి చెందిన బాలసాని నాగమణి, మేచర్ల రేణుక ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల పట్టణ పరిధిలోని ఓ జువెల్లరీ షాపులో బంగారం కొనడానికి కొద్ది రోజుల క్రితం ముగ్గురు మహిళలు వచ్చి చెవి కమ్మలను దొంగలించారు. ఈ విషయాన్ని గుర్తించిన షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ పుటేజీలను పరిశీలించి విచారణ చేపట్టగా నేరం ఒప్పుకున్నారు. నిందితులు గతంలో భద్రాద్రి కొత్తగూడెం, పాల్వంచ, మధిర, నకిరేకల్, మహంకాళి పోలీసు స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో టౌన్ ఎస్సైలు అలీం హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పి మాంసం పట్టివేత

కాటారం(మహాముత్తారం): మహాముత్తారం మండలం రెడ్డిపల్లిలో ఇంట్లో వండిన దుప్పి మాంసాన్ని సోమవారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. పెగడపల్లి రేంజర్ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రయ్య తన మేకలు, కుక్కలను తీసుకొని ప్రతి రోజు అటవీ ప్రాంతానికి మేపడం కోసం తీసుకెళ్తాడు. సోమవారం అటవీ ప్రాంతానికి వెళ్లగా గుర్తు తెలియని అటవీ జంతువులు వేటాడి చంపిన దుప్పి మాంసం చెట్ల పొదల్లో లభించింది. భద్రయ్య మాంసంను ఇంటికి తెచ్చుకొని వంట చేసుకున్నాడు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు దాడిచేసి వండిన దుప్పి మాంసం పట్టుకున్నారు. నిందితుడు భద్రయ్య వివరాలు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి కోర్టు ఎదుట హాజరుపర్చినట్లు రేంజర్ తెలిపారు.

మానేరుకు జలకళ



మల్హర్: మండలంతో పాటు భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాలో కురిసిన వర్షాలతో సోమవారం తాడిచర్ల–ఖమ్మంపల్లి మానేరుకు భారీగా వరద నీరు చేరుకుంది. దీనికి తోడు కరీంనగర్ డ్యాం గేట్లు ఎత్తడంతో వాగుకు ఇరువైపుల నీరు ప్రవహించడంతో మానేరుకు జలకళ సంతరించుకుని నిండుకుండలా దర్శనమిస్తుంది. అడవి సోమన్‌పల్లి, కొయ్యూరు పీవీనగర్‌కు మధ్యలో ఏర్పాటుచేసిన చెక్‌డ్యాం మీదుగా వరద నీరు పరవళ్లు తొక్కుతోంది. వర్షాల కారణంగా చిన్నతూండ్ల ఆరెవాగు ఒడ్డుకు ఇరువైపులా వరద నీరు ప్రవహిస్తుంది.

దేవాదుల మొదటి మోటార్ ట్రయల్ రన్ సక్సెస్

హసన్‌పర్తి : దేవాదుల ప్రాజెక్ట్–3వ దశలో భాగంగా నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. సోమవారం మొదటి మోటారును రన్ చేశారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటలోని పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేశారు. ఐదు నెలల క్రితం రెండో మోటారు భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. మూడో మోటారు ట్రయల్ రన్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు ఈఈ మంగీలాల్, బాలకృష్ణ తదితరులు తెలిపారు.

వరుడిగా వేట వేంకటేశ్వరస్వామి

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

గార్ల: వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం వేట వేంకటేశ్వరస్వామి సమేత శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు, మర్రిగూడెంలో నేటి నుంచి నిర్వహించే బ్రహ్మోత్సవాలకు గార్ల నుంచి ప్రత్యేక రథంపై బయలుదేరారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు వేట వేంకటేశ్వరస్వామి వారిని పట్టువస్త్రాలు ధరింపజేసి, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి సర్వాంగ సుందరంగా వరుడిగా తయారు చేశారు. అనంతరం స్వామివారిని గార్ల మాజీ సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ 50 కేజీల పూలు తెప్పించగా, అర్చకులు పూలమాలలతో అలంకరించిన రథంపై స్వామివారిని ప్రతిష్ఠించి మేళతాళాలతో గార్ల పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తుండగా, మహిళలు కోలాటం నృత్యాలు వేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని భక్తి పారవశ్యం పొందారు. మర్రిగూడెం దేవాలయంలో వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహించిన అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు భద్రత దృష్ట్యా గార్లలోని వేంకటేశ్వరస్వామి దేవాలయానికి తరలిస్తారు. గార్ల నుంచి మర్రిగూడెం వరకు ఉత్సవ విగ్రహాల వెంట ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గార్ల మాజీ సర్పంచ్‌లు అజ్మీర బన్సీలాల్, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, ఈఓ సంజీవరెడ్డి, పుల్లఖండం రమేష్‌బాబు, పరుచూరి కుటుంబరావు, వేమిశెట్టి శ్రీనివాస్, పి.వేణుగోపాల్, ఎం. రాములు, బాదావత్ చంటి, అర్చకులు రామాయణం అచ్యుతాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



రథంపై మర్రిగూడెం దేవాలయానికి బయలుదేరిన స్వామివారు

ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు ఓకే..!

- ఇక పార్ట్‌టైం లెక్చరర్ల నియామకం
- కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంపు
- రూ.20కోట్లతో ప్రహరీ నిర్మాణం
- కేయూ పాలకమండలి సమావేశంలో ఆమోదం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో 2010లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఎట్టకేలకు పదోన్నతులు కల్పిస్తూ కేయూ పాలకమండలి సమావేశం నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వీరి నియామకాలను గత పాలకమండలిలో ఆమోదించినా పెండింగ్‌లో ఉండిపోయింది. తాజా సమావేశంలో పదోన్నతి అంశం చర్చకు వచ్చి పదోన్నతులకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. త్వరలోనే వీరికి క్యాస్ పదోన్నతులు లభించనున్నాయి. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన కేయూ పాలకమండలి సమావేశంలో ఎజెండాలోని పలు అంశాలపై చర్చించి ఆమోదించినట్లు తెలిసింది. యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో రెగ్యులర్ ఆచార్యుల కొరతతో వర్క్‌లోడ్ అధికంగా ఉంది. ఇందుకనుగుణంగా పార్ట్‌టైం లెక్చరర్లను నియమించడం లేదు. ఇటీవల వివిధ విభాగాల్లో పేపర్ వైజ్‌గా నియామకాలు చేపట్టారు. పార్ట్‌టైం లెక్చరర్లను నియమించాలనే విషయంపై పాలకమండలిలో చర్చించారు. వర్క్‌లోడ్‌కు అనుగుణంగా 130 మందిని నియమించుకునేందుకు పాలకమండలి ఆమోదించింది. ఇందుకోసం నోటిఫికేషన్ ఇచ్చి అర్హులైన వారిని నిబంధనలకు అనుగుణంగా తీసుకునే అవకాశం ఉంది. అదేవిధంగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారి పదవీ విరమణ వయస్సును 60 నుంచి 65 ఏళ్లవరకు పెంచుతూ ఆమోదించింది. రెగ్యులర్ ఆచార్యులకు మాదిరిగానే వీరికి ఉద్యోగ విరమణ ఉండనుంది. టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు మరణిస్తే అంత్యక్రియల ఖర్చు రూ.20వేల నుంచి రూ.30వేలకు పెంచుతూ ఆమోదించింది. యూనివర్సిటీ భూమిలో ఇల్లు కలిగి ఉండటంతో పాటుగా పలు ఆరోపణలతో ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌పై విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం న్యాయపరమైన అంశాలను పరిగణనలోనికి తీసుకొని ముందుకెళ్లాలని పాలకమండలి సూచించినట్లు సమాచారం.

ప్రహరీ నిర్మాణంపై ప్రస్తావన

కాకతీయ యూనివర్సిటీలోని భూమి చుట్టూ ప్రహరీ నిర్మించాలనే విషయంపై మళ్లీ పాలకమండలిలో చర్చకు రాగా రూ.20కోట్ల వ్యయంతో కొంత ఎత్తుగా ఉండేలా నిర్మాణాన్ని ప్రభుత్వ సంస్థ టీజీడబ్ల్యూ ఐడీసీకి అప్పగించాలని చర్చించినట్లు సమాచారం. పాలకమండలిలో నిర్ణయించిన ప్రకారం యూనివర్సిటీ అధికారులు ముందుకెళ్లాలని నిర్ణయించారని విశ్వసనీయంగా తెలిసింది. సమావేశంలో కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా, ఉన్నత విద్య కమిషనర్ శ్రీదేవసేన, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, పాలకమండలి సభ్యులు ఆచార్య బి.సురేష్‌లాల్, డాక్టర్ కె.అనితారెడ్డి, డాక్టర్ రమ, డాక్టర్ చిర్రా రాజు, సుకుమారి, మల్లం నవీన్, బాలు చౌహాన్ టి.సుదర్శన్ పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
- కంబాలపల్లి జెడ్పీ హైస్కూల్ తనిఖీ

మహబూబాబాద్ రూరల్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా పాఠ్యాంశాలను బోధించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, లైబ్రరీ గదులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం డిజిటల్ తరగతులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పాఠ్యాంశాలను పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు, మంచి విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. క్రమం తప్పకుండా పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, వారి మానసిక, ఆరోగ్య స్థితిగతులను నిత్యం గమనిస్తూ ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ నిత్యం శానిటేషన్ చేయాలన్నారు. అనంతరం ముత్యాలమ్మగూడెం బాలికల ఆశ్రమ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, మండల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి పరిశీలించారు.

సమన్వయంతో పని చేయాలి

మహబూబాబాద్: అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో 2025–26ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ చేయాలన్నారు. 237 కేంద్రాల ఏర్పాటుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ, నిల్వ, రవాణా, గన్నీ బ్యాగులు తదితర ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అనిల్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూత

- డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్

తొర్రూరు: సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూతనందించాలని డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జ్యూట్ బ్యాగుల పంపిణీ, అల్పాహార వితరణ చేపట్టారు. అనంతరం సేవా కార్యక్రమాలపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సూర్ణం రామనర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. సామాజిక బాధ్యతతో సంస్థలు వ్యవహరించడం అభినందనీయమన్నారు. లయన్స్‌క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలు సమాజ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆరోగ్యంపై అందరూ శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ కార్యదర్శి ముడుపు రవీందర్‌రెడ్డి, గోశాల అధ్యక్షుడు దారం కుమారస్వామి, వైద్యాధికారి బి.నందనాదేవి, వైద్యులు మీరాజ్, ప్రియాంక, ప్రతినిధులు డాక్టర్ కిరణ్‌కుమార్, తమ్మెర విశ్వేశ్వరరావు, వజినపల్లి శ్రీనివాస్, సిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్, ప్రతినిధులు

ఆమెకే ప్రాధాన్యం!

ఆరు జెడ్పీల్లో మూడు చోట్ల మహిళలే..

- ఉమ్మడి జిల్లాలోని 75 జెడ్పీటీసీల్లో 38 ఎంపీపీలుగా 39 మందికి ఛాన్స్
- ఎంపీటీసీ, పంచాయతీల్లోనూ అతివలకే అగ్రస్థానం
- రిజర్వేషన్లతో కలిసివస్తున్న అవకాశం



ఉమ్మడి వరంగల్‌లో 'స్థానిక' వివరాలు ఇలా..

మొత్తం జిల్లాలు: 6

జెడ్పీలు	జెడ్పీటీసీలు	ఎంపీపీలు
6	75	75

ఎంపీటీసీ స్థానాలు	గ్రామ పంచాయతీలు
778	1,708

వార్డులు: 15,006

సాక్షి ప్రతినిధి, వరంగల్:

స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు మహిళలకు కలిసి వస్తున్నాయి. గతంతో పోలిస్తే ఈసారి పురుషులకంటే మహిళలకే ఎక్కువ అవకాశాలు దక్కనున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో జనాభా, ఓటర్ల సంఖ్యతో పాటు ఇటీవల ప్రకటించిన రిజర్వేషన్లు కూడా 'ఆమె'కే ప్రాధాన్యం ఇచ్చాయి. ఈనేపథ్యంలో.. రిజర్వేషన్లు కలిసొచ్చే (భార్య లేదా భర్త) పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు ప్రధాన పార్టీల నాయకులు. సుమారు రెండేళ్ల తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సెప్టెంబర్ 29న రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 9 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలు కానుండగా.. నవంబర్ 11న ఓట్ల లెక్కింపుతో ముగియనుంది. రేపటి హైకోర్టు తీర్పు వెలువడడమే తరువాయి తమకు కేటాయించిన స్థానాల్లో నామినేషన్లు వేసేందుకు మహిళలు రెడీ అవుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆయా పార్టీలకు వారు దరఖాస్తులు కూడా చేసుకున్నారు.

ఓటర్లుగా ఆధిక్యం.. సీట్లలోనూ ప్రాధాన్యం

జనవరి 5న ప్రకటించిన తుది జాబితా ప్రకారం.. ఉమ్మడి వరంగల్‌లో ఓటర్ల సంఖ్య 30,43,540కు చేరింది. పురుషులు, మహిళలు, ఇతరులు, సర్వీసు ఓటర్లు కలిపితే 30.44 లక్షలకు చేరగా.. ఈసారి మహిళలదే అగ్రస్థానం. 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. 12 నియోజకవర్గాల్లో మొత్తం 30,43,540 మంది ఓటర్లు ఉంటే, అందులో పురుషులు 14,89,606 కాగా, మహిళా ఓటర్లు 15,51,289 ఉన్నారు. ఇతరులు (థర్డ్‌జెండర్స్) 504 కాగా, సర్వీసు ఓటర్లు 2,141. ఉమ్మడి వరంగల్‌కు వచ్చేసరికి 12 నియోజకవర్గాల్లో అత్యధికంగా నమోదైన మహిళా ఓటర్లు పురుషులతో పోలిస్తే 61,683 మంది ఎక్కువగా ఉన్నారు. ఈనేపథ్యంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వారికే ప్రాధాన్యం దక్కే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి వరంగల్‌లో ఆరు జిల్లా ప్రజా పరిషత్‌లు ఉండగా.. ములుగు ఎస్టీ మహిళ, హనుమకొండ, జనగామ ఎస్సీ మహిళలకు కేటాయించారు. 75 జెడ్పీటీసీలకుగాను 38 మహిళలకు దక్కాయి. 39 ఎంపీపీ స్థానాలు మహిళలకు దక్కనున్నాయి. అదేవిధంగా 778 ఎంపీటీసీ స్థానాల్లో 399, 1708 గ్రామ పంచాయతీల్లో 860 చోట్ల మహిళలకే అవకాశం దక్కనున్నట్లు అధికారులు విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి.

పోటెత్తుతున్న దరఖాస్తులు

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో.. ప్రధాన రాజకీయ పార్టీలు కసరత్తు ముమ్మరం చేశాయి. ఈక్రమంలో అధికార పార్టీ కాంగ్రెస్ రెండు రోజులుగా నియోజకవర్గాల్లో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహిస్తోంది. స్టేషన్‌ఘన్‌పూర్, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట తదితర నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో ఆశావహులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపారు. వార్డు సభ్యుల నుంచి జెడ్పీటీసీ వరకు దరఖాస్తులు చేసుకోగా.. మహిళా రిజర్వేషన్ స్థానాల్లో ఆశావహులు గట్టిగానే తలపడినట్లు పార్టీ వర్గాల సమాచారం. బీఆర్ఎస్, బీజేపీలు కూడా ఛాలెంజ్‌గా తీసుకుని అభ్యర్థుల వేటలో పడ్డాయి. బీఆర్ఎస్ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ప్రధానంగా ఈసారి మహిళలకు అత్యధిక స్థానాలు రిజర్వ్ కావడంతో ఆ స్థానాల్లో గెలిచే సామర్థ్యం ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసే దిశగా అన్ని పార్టీలు తలమునకలవుతున్నాయి.

ఉపాధ్యాయులను కేటాయించాలి

- డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సాయి కుమార్

మహబూబాబాద్: బయ్యారం మండలం మొట్లగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సాయి కుమార్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. పాఠశాలలో నెలల తరబడి ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకంను అమలు చేయాలని, యూనిఫాం అందించాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం, డీఈఓ కార్యాలయంలో వినతిపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో సూర్య ప్రకాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

క్లుప్తంగా

గురుకుల పాఠశాలకు తాళం

● అద్దె చెల్లించకపోవడమే కారణం



ములుగు రూరల్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలకు తాళం వేసిన సంఘటన ములుగు జిల్లాకేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. భవన యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని భవనాన్ని బాలికల గురుకుల పాఠశాలకు గతేడాది అద్దెకు ఇచ్చామని తెలిపారు. విస్తీర్ణం ప్రకారం నెలకు రూ.2.60లక్షల అద్దె ఒప్పందం కుదుర్చుకున్నామని అన్నారు. ఏడాదిలో అద్దె డబ్బులు రూ.31.20లక్షలు చెల్లించాల్సి ఉందని వాపోయారు. గురుకుల పాఠశాలకు తాళం వేసిన విషయం తెలుసుకున్న కలెక్టర్, ఆర్డీఓ వెంకటేశ్‌తో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. భవన యజమాని గొర్రె సాంబయ్యను పిలిపించి తక్షణం కలెక్టర్ నిధుల నుంచి రూ.4లక్షలు చెల్లిస్తామని తాళం తీసి సహకరించాలని కోరారు. దీంతో యజమాని పాఠశాల సిబ్బందికి తాళం అప్పగించారు.

గుట్కా స్వాధీనం

రఘునాథపల్లి : వరంగల్ టాస్క్‌ఫోర్స్, రఘునాథపల్లి పోలీసుల సంయుక్త తనిఖీలో అక్రమంగా తరలిస్తున్న రూ.24.44 లక్షల గుట్కాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపిన కథనం ప్రకారం.. సోమవారం ఉదయం కోమళ్ల టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వరంగల్ బట్టలబజార్‌కు చెందిన జాలం సింగ్‌రాజ్, పురోహిత్ జబ్బర్‌సింగ్ ఎలాంటి అనుమతి లేకుండా హైదరాబాద్ నుంచి వరంగల్ నగరానికి బొలెరో వాహనంలో అక్రమంగా గుట్కా తరలిస్తుండగా పట్టుకున్నారు. అనంతరం వాహనాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి వినియోగదారులకు జరిమానా

వరంగల్ లీగల్ : గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి వినియోగించిన ఇద్దరికి రూ.15వేల చొప్పున జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి.అపర్ణాదేవి సోమవారం తీర్పు వెల్లడించారు. 2023 మార్చి 27న కాజీపేట ఎస్సై ప్రమోద్‌కుమార్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా స్థానిక భవాని టాకీస్ సమీపంలో ఇద్దరు యువకులు చేతిలో ప్లాస్టిక్ కవర్స్‌తో అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే వారిని పట్టుకొని విచారించగా ఒకరు జ్యూస్ పాయింట్‌లో పనిచేసే ఎండీ నజీం అని, మరొకరు కరీంనగర్ జిల్లా వీణవంక మండల గనుముకుల గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి పలకాల విక్రాంత్‌రెడ్డి అని తెలిపారు. ఇరువురు గంజాయికి అలవాటు పడి గుర్తు తెలియని వారి నుంచి కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు చెప్పారు. విక్రాంత్‌రెడ్డి చదువు ఒత్తిడితో నజీం వద్ద గంజాయి కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా పోలీసులకు చిక్కాడు. నజీం వద్ద కిలోకు పైగా గంజాయి లభించగా, విక్రాంత్‌రెడ్డి వద్ద ఉన్న కవర్‌లో 500 గ్రాముల గంజాయి దొరికిందని పేర్కొన్నారు. వెంటనే ఇరువురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువు కావడంతో జడ్జి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసును ఎస్సై ఎం.శ్వేత పరిశోధించగా, లైజన్ ఆఫీసర్ పరమేశ్వరీ పర్యవేక్షణలో కానిస్టేబుల్ సుధాకర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ మల్లారెడ్డి కేసు వాదించారు.

విద్యార్థుల ప్రతిభకు 'విజ్ఞాన్ మంథన్'

- ఉమ్మడి జిల్లాలోని 6నుంచి ఇంటర్ విద్యార్థులకు సువర్ణావకాశం
- 2025-26 దరఖాస్తుల స్వీకరణ
- ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోవాలి
- రిజిస్ట్రేషన్‌కు ఈనెల 30 చివరి గడువు





కాజీపేట సెంటర్ : దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ (11వ తరగతి) వరకు చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ కార్యక్రమం దోహదపడుతుంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలోఎన్‌సీఈఆర్‌టీ విజ్ఞాన్ ప్రసార్, విజ్ఞాన భారతి సంస్థలు సంయుక్తంగా ప్రతి ఏటా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థుల నుంచి రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. జాతీయ ప్రతిభ అన్వేషణ పరీక్ష విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం-2025-26) ఆన్‌లైన్ విధానంలో ఓపెన్ బుక్ పద్ధతి ద్వారా విద్యార్థులు ఇంటి వద్ద నుంచే రాసుకోవచ్చు. విజ్ఞాన, సామాజిక శాస్త్రాల అధ్యయనంపై విద్యార్థులు ఉత్తమ పరిశోధకులుగా ఎదిగి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) నిర్వహిస్తున్నారు.

వీవీఎం లక్ష్యాలు..

సైన్స్‌పై పిల్లలకు ఆసక్తి కలిగించుట, శాస్త్ర సాంకేతిక ప్రపంచ అభివృద్ధిలో భారతీయుల కృషిని పాఠశాల విద్యార్థులకు తెలియజేస్తారు. ఉన్నత స్థాయి వైజ్ఞానిక విద్యను అభ్యసించేందుకు పిల్లలు అవసరమైన మార్గాలను ఏర్పాటు చేస్తారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించి ప్రోత్సహిస్తారు. జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు భాస్కర స్కాలర్‌షిప్ పథకం ద్వారా ఉపకార వేతన లభిస్తుంది.

పరీక్ష విధానం..

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2025-26 పరీక్షలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, స్టేట్ బోర్డు అనుమతి పొందిన పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థులను జూనియర్, 9, 10, 11 తరగతుల విద్యార్థులు సీనియర్ విభాగంలో పాల్గొనవచ్చు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. ఆన్‌లైన్‌లోనే పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్, హిందీతో పాటు ప్రధానమైన 14 రీజనల్ భాషల్లో ఉంటుంది. ప్రతిభ కనబర్చడానికి నాలుగు దశల్లో పరీక్ష నిర్వహిస్తారు.

జాతీయ పరీక్ష ఇలా..

ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థులను ఆయా రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి క్యాంపులకు ఎంపిక చేస్తారు. మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేల చొప్పున అందజేస్తారు. అదే విధంగా జాతీయస్థాయిలో అదనంగా దేశంలోని నాలుగు జోన్ల నుంచి ప్రతి తరగతి నుంచి మొత్తం 18 మందికి పారితోషికాలు ఇస్తారు. జాతీయ స్థాయి విజేతలకు నెలకు రూ.2 వేల చొప్పున ఏడాది పాటు భాస్కర స్కాలర్‌షిప్ అందజేస్తారు.

దరఖాస్తులు ఇలా..

పరీక్షకు హాజరయ్యే విద్యార్థి రూ.200ల ఫీజు చెల్లించి దరఖాస్తును www.vvm.org.in ఆన్‌లైన్ ద్వారా పేరు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలి. విద్యార్థి వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి రిజిస్టర్ చేసుకోవాలి. పాఠశాల ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేసిన కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహిస్తారు. కనీసం 50 మంది ఒకే పాఠశాలలో పరీక్ష రాయడానికి ఉన్నట్లయితే అక్కడే కంప్యూటర్, ఇంటర్‌నెట్ సౌకర్యం ఉంటే అదే సెంటర్‌ను కేటాయించే అవకాశం ఉంది. ఈనెల 30వ తేదీ వరకు పాఠశాలల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష వచ్చే నెలలో ఉండే అవకాశం ఉంది. పరీక్ష సమయం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 8 గంటల మధ్య ఎప్పుడైనా 90 నిమిషాలు మాత్రమే ఉంటుంది.

విద్యార్థుల సృజనాత్మకతకు పదును..



"విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2025-26 పరీక్ష ద్వారా విద్యార్థుల సృజనాత్మకతకు పదును పెట్టే అవకాశం ఉంది. ఈ పరీక్షలో పాల్గొనేందుకు ఆయా పాఠశాలల సైన్స్ టీచర్లు విద్యార్థులను ప్రోత్సహించి వారి ప్రతిభను వెలికితీయాల్సిన అవసరం ఉంది. ఈ పరీక్షలో పాల్గొనే విద్యార్థులు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ పొంది ఉండాలి. అర్హత గల పాఠశాలకు విజ్ఞాన్ మంథన్‌తో సువర్ణావకాశం లభిస్తుంది. దీనిపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలి.

- డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి,వరంగల్

పేదల అభ్యున్నతికి కృషిచేయాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

కేయూ క్యాంపస్ : విద్యా, పేదరికం, ఆర్థిక పురోగతి లేని అత్యంత పేదవర్గాల అభ్యున్నతికి మాదిగ ఉద్యోగులు కృషిచేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ సూచించారు. ఎంఈఎఫ్‌ను సంస్థాగతంగా నిర్మాణం చేస్తూనే పీడిత వర్గాల విముక్తికి భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలో గణితశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా మాదిగ ఉద్యోగుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేసి సాధించుకున్న ఎస్సీ వర్గీకరణను అన్ని విభాగాల్లో వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాల నియామకాలు, పదోన్నతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా మంద కృష్ణమాదిగను మాదిగ ఉద్యోగులు గజమాలతో సన్మానించారు. కేయూ ఎంఈఎఫ్ అధ్యక్షుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.మనోహర్, ఎంఈఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ బొడ్డు దయాకర్, కేయూ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లా శ్రీనివాస్, ధనయ్య, దిలీప్, రాజ్‌కుమార్, సంకినేని వెంకట్, సుజాత, బొక్క మొగిలి, తిరుపతి, మామిడి లింగయ్య, చిలువేరు రాజ్‌కుమార్, మంద శ్యామ్, రాజు, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రపంచ టాప్ 2శాతం శాస్త్రవేత్తల్లో డాక్టర్ రమేశ్



నర్సంపేట రూరల్ : అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, ఎల్సివియర్ (నెదర్లాండ్స్) సంయుక్తంగా ప్రకటించిన ప్రపంచ టాప్ 2శాతం శాస్త్రవేత్తల జాబితాలో వరంగల్ జిల్లా నర్సంపేట మెడికల్ కళాశాల వైద్యుడు కందిమల్ల రమేశ్ నాలుగో ఏడాది వరుసగా ఎంపికయ్యారు. డాక్టర్ కందిమల్ల రమేశ్ నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చెందిన బయో కెమిస్ట్రీ విభాగం ఇన్‌చార్జ్ హెడ్, అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. 2022 నుంచి 2025 వరకు వరుసగా నాలుగో సారి ఈ గౌరవం లభించడం విశేషం. డాక్టర్ రమేశ్ క్లినికల్ మెడిసిన్ ప్రధాన విభాగంలో, న్యూరాలజీ, న్యూరోసర్జరీ ఉప విభాగంలో 3,60,881మంది శాస్త్రవేత్తల్లో 3,405వ స్థానంలో నిలిచారు. ఆయనకు హెచ్-ఇండెక్స్, 17, హెచ్‌ఎం ఇండెక్స్ 5.91లు నమోదు అయ్యాయి. న్యూరో జెనరేటివ్ వ్యాధులు, మైటోకాండ్రియా బయాలజీ, అల్జీమర్స్ వ్యాధిపై పరిశోధనలు, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమైన విశ్లేషణలను పరిగణనలోకి తీసుకున్నట్లు డాక్టర్ రమేశ్ తెలిపారు. ఈ గుర్తింపు తమ గురువులు, సహచరులు, పరిశోధన భాగస్వాములు, విద్యార్థుల మద్దతుతో సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్‌లోనూ మానవ ఆరోగ్యానికి ఉపయోగపడే బయో మెడికల్ పరిశోధనలను కొనసాగించేందుకు కట్టుబడి ఉంటానని తెలిపారు.

సహాయక చర్యలు అందించాలి


ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బందితో బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి తదితరులు

- టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి

మామునూరు : విపత్తుల వేళ శిక్షణలో నేర్చుకున్న మెలకువలతో తక్షణమే సహాయక చర్యలు అందించాలని టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి సూచించారు. మామునూరులోని టీజీఎస్పీ నాలుగో బెటాలియన్‌లో ఇటీవల ఎంపికైన 17వ బెటాలియన్‌కు చెందిన 100 మంది ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బందికి నెల రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. 17వ బెటాలియన్ కమాండెంట్ ఎంఐ.సురేష్, ఏసీ శ్రీనివాసరావు, వీరన్న, ఆర్ఐ రాజు, విజయ్, రవి, కార్తీక్, రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక లోపం.. తూకంలో ఆలస్యం

వరంగల్ చౌరస్తా : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లలో ఏర్పడిన సాంకేతిక లోపం వల్ల సోమవారం రెండు గంటల పాటు తూకాలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. పది రోజులు మార్కెట్‌కు సెలవులు ఉన్నా అధికారులు సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయించలేదు. సెలవుల అనంతరం మార్కెట్‌కు విక్రయించేందుకు రైతులు పత్తిని తీసుకువచ్చారు. ఉదయం 6గంటలకు రైతుల పేర్లు, బస్తాల వివరాలను సిబ్బంది, సెక్యూరిటీ గార్డు నమోదు చేస్తుంటారు. కానీ ఆ మిషన్లు పని చేయలేదు. అంతేకాకుండా దడువాయిల వద్ద ఉండే యంత్రాలు సైతం అప్‌డేట్ లేక పనిచేయలేదు. దీంతో ఉదయం 9 గంటల వరకు ధరలు పూర్తయినా కాంటాలు మొదలు కాకపోవడంతో రైతుల్లో నిరసన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో మార్కెట్ అధికారుల ఆదేశాలతో ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లపై కాంటాలు వేసి, మ్యాన్యువల్ పద్ధతిలో రైతులకు చీటీలు అందజేశారు.

గుండెపోటుతో గ్రేహౌండ్స్ ఆర్‌ఎస్సై మృతి

- పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరైన గ్రేహౌండ్స్ డీఐజీ, ఎస్పీ, డీఎస్పీ
- నివాళులర్పించిన ఎమ్మెల్యే శ్రీహరి


అచ్యుతరెడ్డి (ఫైల్)


గౌరవ వందనం చేస్తున్న గ్రేహౌండ్స్ పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన గంగుల అచ్యుతరెడ్డి (54) హైదరాబాద్ గ్రేహౌండ్స్‌లో ఆర్‌ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 4న గుండెపోటుతో మృతిచెందగా స్వగ్రామమైన రాఘవాపూర్‌లో సోమవారం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.అచ్యుతరెడ్డి ప్రస్తుతం హైదరాబాద్ గ్రేహౌండ్స్‌లో ఆర్‌ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. 1990లో గ్రేహౌండ్స్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి ఆర్‌ఎస్సై అయ్యారు. కాగా ఈనెల 4న సాయంత్రం విధి నిర్వహణలో ఉండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారు. అచ్యుతరెడ్డి మృతదేహాన్ని సోమవారం స్వగ్రామమైన రాఘవాపూర్‌కు తరలించారు. రాఘవాపూర్‌లో దాదాపు వంద మంది గ్రేహౌండ్స్ పోలీసులు అధికార లాంఛనాలతో, బంధువులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర నిర్వహించారు. గ్రేహౌండ్స్ పోలీసులు గౌరవ వందనం చేసి లాంఛనంగా గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ యాత్రలో గ్రేహౌండ్స్ డీఐజీ కల్మాల్, ఎస్పీ సత్యశ్రీనివాస్, డీఎస్పీ సాగర్, ఆర్ఐ శంకర్‌తో పాటు గ్రేహౌండ్స్ పోలీసులు, రిటైర్డ్ అధికారులు పాల్గొన్నారు. కాగా మృతుడికి భార్య మంజుల, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అచ్యుతరెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం రాఘవాపూర్‌కు చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు.

నేడు పీఎంశ్రీ స్కూల్స్ టీచర్లకు శిక్షణ


హనుమకొండ జిల్లాలోని ఒంటిమామిడిపల్లి పాఠశాలలో విద్యార్థులకు త్రీడీ పరికరాలతో అభ్యసన చేయిస్తున్న ఉపాధ్యాయుడు

విద్యారణ్యపురి : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల టీచర్లకు డిజిటల్ కంటెంట్‌తో త్రీడీ మోడల్‌లో విద్యాబోధనకు గాను నేడు మంగళవారం శిక్షణ ఇవ్వనున్నారు. హైదరాబాద్ నుంచి టెక్నికల్ రిసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాక వాటిని ఎలా వినియోగించుకోవాలనేది విద్యార్థులకు ఏఆర్, వీఆర్‌ను అమలు చేస్తారు. ముఖ్యంగా గణితం, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్, ఇంగ్లిష్ టీచర్లు, హెచ్‌ఎంలు శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుంది. హనుమకొండ జిల్లాలో 19 పీఎం శ్రీ స్కూల్స్ ఉండగా అందులో మడికొండలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ఒంటిమామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న స్కూల్స్‌కు ఏఆర్, వీఆర్ అమలుకు ఎంపిక చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంపికైన ఆయా పాఠశాలలకు ఒక్కో స్కూల్‌కు 25 చిన్నట్యాబ్‌లు, 10 చొప్పున త్రీడీ పరికరాలు, టీచర్‌కు ఒక పెద్ద ట్యాబ్ చొప్పున రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్ష అధికారులు ఇప్పటికే పంపిణీ చేశారు.

- వరంగల్ జిల్లాలో రెండు నర్సంపేట జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్, రాయపర్తి మండలం కొండూరు జెడ్పీఎస్ఎస్ ఎంపికైంది. నర్సంపేటలో జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో శిక్షణ ఉంటుంది.
- జనగామ జిల్లాలోని ధర్మకంచ జెడ్పీ ఉన్నత పాఠశాల, ములుగు జిల్లాలో ఏటూరునాగారం జెడ్పీఎస్ఎస్ వీరికి మడికొండ హైస్కూల్‌లో శిక్షణ ఉంటుంది.
- జయశంకర్ భూపాలపల్లిలోని గొల్లబుద్దారం జెడ్పీఎస్ఎస్ ఎంపికైంది.
- మహబూబాబాద్ జిల్లాలో నాలుగు పీఎంశ్రీ స్కూల్స్ మహబూబాబాద్ జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్, తొర్రూరు, దంతాలపల్లి జెడ్పీఎస్ఎస్, గూడూరు మండలం పొనుగోడు జెడ్పీఎస్ఎస్‌ను ఎంపిక చేశారు. ఆయా టీచర్లకు మహబూబాబాద్ గర్ల్స్ హైస్కూల్స్‌లో శిక్షణ ఇవ్వనున్నారు.

పాకాల అందాలు అదరహో..!

- పెరుగుతున్న పర్యాటకుల తాకిడి


పాకాల మత్తడి వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు


సరస్సు వద్ద బోటింగ్ చేస్తున్న పర్యాటకులు (ఫైల్)

ఖానాపురం : పర్యాటకానికి నెలవు పాకాల.. దీంతో ఈ ప్రాంతానికి పర్యాటకుల తాకిడి నిత్యం పెరుగుతోంది.. పాకాల అందాలను వీక్షించేందుకు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వస్తున్నారు.. పర్యాటకులు పెరుగుతుండటంతో పాకాలకు ఆదాయం సైతం వస్తుంది. దీంతో అభివృద్ధికి సైతం ముమ్మర అడుగులు పడుతున్నాయి.. జిల్లాలో ఏకైక పర్యాటక ప్రాంతం కావడంతో పాటు పాకాలకు ప్రపంచ, దేశ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉండడం, చక్కటి ఆహ్లాదాన్ని పంచుతుండటంతో పర్యాటకులు తరలివస్తున్నారు. వరంగల్ జిల్లాలోని ఏకైక పర్యాటక ప్రాంతంగా పాకాల. ఈ సరస్సు అందాలతో పాటు మత్తడి వద్ద, తూములీకేజీల నీటితో జలకళ సంతరించుకుంటుంది. సుమారు 52రోజులుగా మత్తడి పోస్తూనే ఉంది. సెలవులతో పాటు సాధారణ రోజుల్లోనూ పాకాల అందాలు చూసేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు. డీఎఫ్ఓ అనూజ్‌అగర్వాల్, ఎఫ్ఆర్ఓ రవికిరణ్‌ల ఆధ్వర్యంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతూనే ఉన్నారు. సెప్టెంబర్‌లో పాకాలకు 5,489 మంది పర్యాటకులు రావడంతో వివిధ రూపాల్లో రూ.3,26,610 ఆదాయం సమకూరింది. కాగా దసరా సెలవుల నేపథ్యంలో పాకాలకు పర్యాటకుల తాకిడి నెలకొంది. కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే 4,235 మంది పర్యాటకులు రావడంతో రూ.2,60,710 ఆదాయం వచ్చింది. పర్యాటకుల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు ఫారెస్ట్ శాఖ ద్వారా వస్తున్న ఆదాయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. వినూత్న రీతిలో అభివృద్ధి పనులకు అధికారులు శ్రీకారం చుట్టి పర్యాటకులను ఆకర్షించే విధంగా అధికారులు కృషి చేస్తున్నారు. దీంతో పాకాలలో పర్యాటకుల సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతుంది.

పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి



"పాకాల అందాలను పర్యాటకులు వీక్షించేలా చర్యలు చేపడుతున్నాం. పాకాలకు వచ్చే పర్యాటకులకు మధురానుభూతి కలిగే విధంగా అభివృద్ధి పనులు సైతం చేస్తున్నాం. ఇప్పటికే మంజూరైన నిధులతో రెస్టారెంట్లను సైతం ఏర్పాటు చేయనున్నాం. పాకాల అందాలను వీక్షించేందుకు వచ్చే వృద్ధులకు బ్యాటరీ వాహనాలు సైతం తెచ్చాం. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నాం.

- పుప్పాల రవికిరణ్, ఎఫ్ఆర్ఓ, నర్సంపేట

అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- టీయూఈఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామి


సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర, జిల్లా నాయకులు,అన్‌మ్యాన్డ్ వర్కర్లు

హన్మకొండ : టీజీ ఎన్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.స్వామి డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తూ కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు అంగవైకల్యం పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ప్రమాదంలో చనిపోయిన బాధిత కుటుంబాలకు యాజమాన్యం పరిహారం అందించాలని, వారి కుటుంబలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఆర్టిజన్లుగా గుర్తించాలని, రిక్రూట్‌మెంట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ టీజీ ఎన్పీడీసీఎల్ శాఖ గౌరవ అధ్యక్షుడు జి.ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాచర్ల కుమారస్వామి, వరంగల్ జిల్లా సెక్రటరీ శ్రీనివాస్, నాయకులు పూర్ణచారి, వరుణ్ గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

పాలకుర్తి టౌన్ : మద్యానికి బానిసై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గూడూరులో సోమవారం జరిగింది. ఎస్సై డి.పవన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరు గ్రామానికి చెందిన ఏడునూరి దేవేంద్ర, లింగయ్యల కుమారుడు రాజేష్ (27) రెండేళ్లుగా హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దసరా పండుగ సందర్భంగా సొంతూరుకు వచ్చాడు. గతేడాది నర్మెటకు చెందిన రాధికతో రాజేష్‌కు వివాహం జరిగింది. గత కొద్ది నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మృతుడి తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై డి.పవన్‌కుమార్ తెలిపారు.

నిలువ నీడ లేక.. నడిరోడ్డుపైనే మృతదేహం

- దాతల సాయంతో అంత్యక్రియలు


బాధితుడికి నగదు అందజేస్తున్న ఎస్సై సతీశ్

కురవి : నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు, జాగ లేదు.. అద్దె ఇంట్లో నివాసముంటున్నారు.. ఇంటి పెద్ద అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందింది. దీంతో ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని అద్దె ఇంటికి తీసుకొస్తే ఇంటి యజమాని వద్దని చెప్పడంతో నడిరోడ్డుపై టెంట్ వేసి మృతదేహాన్ని ఉంచారు. ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కురవి గ్రామానికి చెందిన గల్వాయి లలిత (55)కు కుమార్తె, కుమారుడు ఉన్నారు. లలిత అనారోగ్యానికి గురికావడంతో కొడుకు రాజేశ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని అద్దెకు ఉండే ఇంటికి తీసుకురావడంతో యజమాని తమ ఇంట్లో మృతదేహం వద్దని నిరాకరించడంతో ఏం చేయాలో అర్థం కాలేదు. దిక్కుతోచని స్థితిలో రాజేశ్, బంధువులు రోదిస్తూ మృతదేహాన్ని అలాగే ఉంచారు. చేసేదేమి లేక సొంత ఇంటి స్థలం సైతం లేకపోవడంతో బోరున విలపిస్తూ నడిరోడ్డుపై టెంట్ వేసి కిందనే మృతదేహాన్ని పెట్టారు. దహన సంస్కారాలకు సైతం చేతిలో చిల్లిగవ్వలేని వారిని ఆదుకునేందుకు కురవి ఎస్సై గండ్రాతి సతీశ్ దాతృత్వాన్ని చాటుకున్నాడు. రూ.6వేల నగదు అందజేసి ఆదుకున్నారు. అలాగే కురవికి చెందిన గంగరబోయిన రఘు ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ ఇరాక్‌లోని అమెరికా ఆర్మీ బేస్ క్యాంపులో ఉండే మనూ తక్షణమే రూ.5వేలు పంపించాడు. అనురాధ ఏజెన్సీ యజమాని గజ్జెల్ల వీరన్న రూ.2వేలు అందజేశారు. దీంతో లలిత మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు.